https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 343 ఆదివారం 1-3-2026 పేజీలు : 4



రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.


# పేలిన ప్రాణాలు



- 'గోదావరి జిల్లా'లో మరో బాణసంచా విషాదం
- 21మంది బుగ్గి
- 10 మందికి గాయాలు
- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో భారీ విస్ఫోటం
- శివారు పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్
- సింగారమ్మ జాతర కోసం భారీగా ఆర్డర్
- తయారీ పనిలో నిమగ్నమైన కార్మికులు
- అర కిలోమీటరు ఎగిరి పడిన మృతదేహాలు

**కాకినాడ ఫిబ్రవరి 28 :**
అది... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు! గోదావరి కాలువ అవతల పచ్చని పొలాల మధ్య... సూర్యశ్రీ ఫైర్ వర్క్! శనివారం మధ్యాహ్నం 2.10 గంటలు! శుభకార్యాలు, జాతర్ల కోసం భారీగా బాణసంచా తయారు చేయడంలో కార్మికులు నిమగ్నమయ్యారు. అంతలోనే... ఒక్కసారిగా పెను విస్ఫోటం! ఎనిమిది కిలోమీటర్ల దూరానికీ వినిపించిన శబ్దాలు! భూకంపం వచ్చిందా అన్నంతగా కంపించిన పరిసరాలు! వరుసగా పేలుళ్ల మీద పేలుళ్లు జరుగుతూనే ఉన్నాయి. 20 మీటర్ల ఎత్తుదాకా మంటలు ఎగిసి పడ్డాయి. పేలుళ్ల ధాటికి అక్కడికక్కడే 21 మంది చనిపోయారు. బాణసంచా తయారీ కేంద్రానికి సంబంధించిన రెండు షెడ్లు కుప్ప కూలిపోయాయి. కార్మికులకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు ముక్కలు ముక్కలుగా విడిపోయాయి. సినిమాల్లో చూపినట్లుగా సైకిళ్లు గాలిలోకి ఎగిరి కిందపడ్డాయి. ఇనుప డ్రమ్ములు, స్తంభాలు తుత్తునియలయ్యాయి. పేలుడు తీవ్రత తెలుపుతూ... ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది. వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్ బాణసంచా తయారీ కేంద్రం బాణాసంచా తయారీకి ప్రసిద్ధి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుభకార్యాలు, జాతరలు, పండగలకు ఇక్కడి నుంచే బాణసంచా వెళ్తుంది. అడబాల శ్రీను అనే వ్యక్తి తన ఇద్దరు కుమారులు అడబాల వీరబాబు, అర్జున్ పేర్లతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తాజాగా... జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం సింగారమ్మ చింత అమ్మవారి ఉత్సవాలకోసం భారీ ఆర్డరు వచ్చింది. దీంతో తాత్కాలికంగా మరికొందరు కార్మికులను నియమించుకున్నారు. సామర్లకోట, వేట్లపాలెం, మేడపాడు తదితర ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది శనివారం బాణసంచా తయారీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వారిలో దాదాపు సగంమంది భోజనానికి వెళ్లారు. మిగిలిన వారంతా పనిలో నిమగ్నమయ్యారు. వివిధ వర్గాల కథనం ప్రకారం... కలర్ చిచ్చుబుడ్ల తయారీ దగ్గరే తొలి చిచ్చు పుట్టుంది. ఈ చిచ్చుబుడ్లలో మందు కూరేందుకు మెల్లగా సుత్తితో కొడతారు. ఆ సమయంలోనే నిప్పు రవ్వ రాజుకుంది. అది పక్కనే ఉన్న 'సెర్ఫ్ లైట్' అనే మరోరకం బాణసంచాపై పడింది. మెల్లగా పేలుడు మొదలైంది. అక్కడికి దగ్గరే వందల సంఖ్యలో 'నార బాంబులు' (బ్యాటరీ బాంబులు) ఉన్నాయి. వాటికీ మంట అంటుకుంది.

# పని చేయలేకపోతే తప్పుకోండి!

## సెలవులో వెళ్లినా అభ్యంతరం లేదు



- లూప్‌లైన్ పోస్టు కావాలంటే పంపిస్తా
- అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడమూ నాకు తెలుసు
- కొన్ని రాష్ట్రాల్లో బలవంతంగా రిటైర్మెంట్.. అవసరమైతే దాన్నీ పరిశీలిస్తా
- పనిచేయని అధికారుల వివరాలను ఈనెల 4వ తేదీన బయటపెడతా.. ఐఏఎస్‌లకు సీఎం హెచ్చరిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 28**
ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచిందని, ఎవరి పనితీరు ఎలా ఉందో తన దగ్గర పూర్తి సమాచారం ఉందని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుతిమెత్తగా హెచ్చరించారు. పని చేయలేమని భావించే అధికారులు పక్కకు తప్పుకోవాలని, వీలైతే సెలవులో పోయినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కీలక బాధ్యతలను నిర్వర్తించలేమని భావించే అధికారులు లూప్‌లైన్ పోస్టు కావాలనుకుంటే అక్కడికే పంపుతామని తేల్చి చెప్పారని తెలిసింది. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం కూడా తనకు తెలుసని వ్యాఖ్యానించారు. "ఎవరు పని చేస్తున్నారు.. ఎవరు పని చేయడం లేదనే సమాచారం నా దగ్గర ఉంది. పని చేయని అధికారుల వ్యక్తిగత వివరాలను 4వ తేదీన జరిగే కలెక్టర్ల సమావేశంలో బయట పెడతాను" అని స్పష్టం చేశారు. ఆరోజు ప్రతి అధికారి పనితీరు ఎలా ఉందో చర్చిస్తానని చెప్పారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి రేవంత్ శనివారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితోపాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గడచిన రెండున్నరేళ్లలో ఇప్పటి వరకు నిర్ణయాలు తీసుకున్నామని, ఇకపై ఫలితాలు చూపించాలని సూచించారు. ప్రతి ఎన్నికలో కావాల్సినంత బలాన్ని ప్రజలు తనకుఇస్తున్నప్పుడు.. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని వారికి మంచి చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. అందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనకాడబోదని హెచ్చరించినట్లు తెలిసింది. సమావేశమంతా కార్యదర్శుల పనితీరు చుట్టే జరిగిందని సమాచారం. ఐఏఎసలుగా మీరు రిటైరైన తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకునేలా పని చేయాలంటూ సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. సీఎం కావాలన్న తన లక్ష్యాన్ని చేరుకున్న విధంగానే, అధికారులుగా మీరు ఒక లక్ష్యం పెట్టుకుని అది సాకారమయ్యే దిశగా సాగాలని సూచించారని సమాచారం. పనితీరు బాగాలేని ఐఏఎ?సలను కొన్ని రాష్ట్రాల్లో బలవంతంగా పదవీ విరమణ చేయించారని, తీరు మార్చు కోకపోతే ఆ అంశంపైనా పరిశీలన చేస్తామని నవ్వుతూనే చురక లు అంటించినట్టు తెలిసింది. కొన్ని శాఖల పరిధిలో ఆన్‌లైన్ విధానంలో వచ్చిన దరఖాస్తులను దగ్గర పెట్టుకుని, సంబంధిత వ్యక్తులను పిలిపించుకుని మాట్లాడుతున్నారని, అందుకు సంబం ధించిన డేటా మొత్తం తన దగ్గరుందని, అవసరమై నప్పుడు ఆ వివరాలు బయటపెడతానని హెచ్చరించారు. కొన్ని శాఖల అధికారుల మధ్య సమన్వయమే ఉండడం లేదని, వారిని సమన్వయం చేయడానికే తనకు సమయం పడుతోందని అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. ఇకపై అలాంటి పరిస్థితు లు ఉత్పన్నమవకుండా చూసుకోవాలని సూచించారు. సమావే శం ముగిసే సమయంలో 'ఇవ్వాళంతా బాగా రెస్ట్ తీసుకోండి.. రేపటి నుంచి బాగాపనిచేయండి' అని నవ్వుతూనే సూచించారని సమాచారం.

# దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

## రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:**
మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్) నివారణ చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోనూ వైరస్ (హెచ్‌పీవీ) టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రధాని మోదీ శనివారం ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశ సమగ్రాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం దీనికి నిదర్శనమని తెలిపారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అవమాని స్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్‌లాగా దేశాన్ని వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్‌లో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 14 సంవత్సరాల వయసున్న బాలికలకు ప్రతిఏటా 1.15 కోట్ల టీకాలను పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (పీహెచ్‌సీలు), కమ్యూ నిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ఈ టీకాను ఉచితంగా అందిస్తారు.

# అప్రూవర్‌గా అర్వింద్‌కుమార్?

## ఫార్ములా- ఈ రేసు కేసులో కీలక పరిణామం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28**
ఫార్ములా- ఈ రేసు కేసుకు సంబంధించి కీలక పాత్ర పోషించిన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ అప్రూవర్‌గా మారడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. అర్వింద్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడంతో ఈ కేసుకు సంబంధించి ఛార్జిషీట్ దాఖలుకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో కొద్ది రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ సిద్ధమౌతోంది. ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్, అర్వింద్‌కుమార్, పదవీ విరమణ చేసిన మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డితో పాటు మరో ముగ్గురి పేర్లను నిందితులుగా ఏసీబీ అధికారులు చేర్చనున్నారని తెలుస్తోంది. అయితే, ఈ కేసులో తనను అప్రూవర్‌గా మార్చుకోవాలని అర్వింద్‌కుమార్ వివిధ వర్గాల ద్వారా ఏసీబీ ఉన్నతాధికారులను సంప్రదించినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతుంది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడం, ఆ తర్వాత అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర డీఓపీటీ కూడా లైన్ క్లియర్ చేయడంతో ఏసీబీ అధికారులు తుది చర్యలకు సన్నద్ధమవు తున్నారు. ఫార్ములా- ఈ రేసు కేసులో ఇప్పటికే మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు కూడా ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ పూర్తి చేయడంతో ఏసీబీ తర్వాత ఈడీ కూడా న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేయవచ్చని తెలుస్తోంది.

# మోదీ ఇజ్రాయెల్ పర్యటన సిగ్గుచేటు: కాంగ్రెస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:**
ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్ పార్టీ నిశిత విమర్శలు చేసింది. ఈ పర్యటనను సిగ్గుచేటుగా పేర్కొంది. ఇజ్రాయెల్‌లో పర్యటించిన సమయం కూడా సరికాదని వ్యాఖ్యానించింది. ఇది సైనికచర్యకు రాజకీయ ఆమోదం ఉందన్న భావనను కల్పించేలా ఉందని దుయ్యబట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల వేళ మోదీ చేసిన పర్యటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన చెందుతోందని తెలిపారు. కాగా, మోదీ ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించారు.

# ఇరాన్ పై భీకర దాడి

## 200 ఫైటర్ జెట్లతో క్షిపణుల వర్షం 201 మంది మృతి

- విరుచుకుపడ్డ అమెరికా, ఇజ్రాయెల్
- టెహ్రాన్, ఇతర కీలక ప్రాంతాల్లో క్షిపణుల వర్షం
- 500 లక్ష్యాలపై ఏకకాలంలో దాడి
- స్కూలుపై క్షిపణి.. 85 మంది పిల్లల మృతి
- ఖమేనీ నివాసంపైనా దాడులు.. జాడ తెలియని నేత
- ఆయన అల్లుడు, కోడలు మృతిచెందినట్టు వార్తలు
- ఇరాన్ రక్షణ మంత్రి, సైన్యాధిపతి మృతి: ఇజ్రాయెల్



**దుబాయ్/వాషింగ్టన్/టెల్ అవీవ్, ఫిబ్రవరి 28:**
పశ్చిమాసియాలో యుద్ధ భేరి మోగింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. పెద్ద సంఖ్యలో క్షిపణులతో విరుచుకుపడ్డాయి. యుద్ధ విమానాలతోనూ కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీనితో ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగింది. అటు ఇజ్రాయెల్‌పై, ఇటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై పెద్ద సంఖ్యలో క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. తమ దేశాల్లోని ప్రాంతాలపై ఇరాన్ దాడులను ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ, యూఈఏ తీవ్రంగా ఖండించాయి. ఇరాన్ దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాయి. దీనితో పశ్చిమాసియా ప్రాంతమంతా అట్టుడుకుతోంది. శనివారం రాత్రి కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు కొనసాగించడం.. అటు ఇరాన్ కూడా ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతుంటంతో.. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. మరింత ఉధృతంగా దాడులు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు అమెరికా రక్షణ వర్గాలు శనివారం రాత్రి వెల్లడించాయి.

**అటు చర్చలు అంటూనే ఇటు దాడులు..**


ఇరాన్ అణుశుద్ధిని పూర్తిగా నిలిపివేయాలని, క్షిపణుల సామర్థ్యాన్ని తగ్గించుకోవాలని అమెరికా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ ఒప్పందానికి రావాలని, లేకుంటే దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు హెచ్చరించారు కూడా. ఈ క్రమంలో ఒమన్ మధ్యవర్తిత్వంతో స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఇరాన్-అమెరికా మధ్య మూడు దఫాలుగా చర్చలు కూడా జరిగాయి. గురువారం జరిగిన చర్చల అనంతరం అణుశుద్ధి విషయంలో ఇరాన్ దిగివస్తోందని, పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడతాయని కూడా వార్తలు వెలువడ్డాయి. కానీ దీనిపై తాను అంత సంతృప్తిగా లేనని ట్రంప్ శుక్రవారం పేర్కొన్నారు. అన్నట్టుగానే శనివారం ఉదయమే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు 30 కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించాయి. ఇరాన్ క్షిపణి ప్రయోగ వ్యవస్థలు, మిలటరీ స్థావరాలతోపాటు ప్రభుత్వాధినేతలు, మిలటరీ ఉన్నతాధికారులు లక్ష్యంగా యుద్ధ విమానాలతోనూ ఏకకాలంలో దాడులు చేశాయి.

# సామర్లకోట పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**18 మంది మృతిపై ఆవేదన - హోంమంత్రి అనితకు తక్షణ ఆదేశాలు**

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కల్పించాలని సూచనలు**





**విజయనగరం, ఫిబ్రవరి 28**

: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల మధ్య ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన భారీ పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమం నిమిత్తం విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుకు అధికారులు ఈ ఘటన వివరాలు తెలియజేశారు. ప్రమాద తీవ్రత, ప్రాణనష్టం గురించి సమగ్ర సమాచారం అందించినట్లు తెలిసింది. విషయం తెలిసిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను అప్రమత్తం చేశారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రమాద స్థలంలో సహాయ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎం స్పష్టమైన సూచనలు ఇచ్చారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సమీప ఉన్నత ఆసుపత్రులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో మరో 15 మందికి తీవ్ర గాయాలు కాగా, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భారీ ప్రాణనష్టం సంభవించిన ఈ ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలుస్తోంది.

# సామర్లకోటలో బాణసంచా కేంద్రంలో ఘోర పేలుడు

**18 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు**

**ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిన శబ్దం- భద్రతా లోపాలపై స్థానికుల ఆగ్రహం**





**కాకినాడ జిల్లా, ఫిబ్రవరి 28**

జిల్లాలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సామర్లకోట మండలం వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల మధ్య గోదావరి కాలువ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 18 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పేలుడు తీవ్రత అత్యంత భయానకంగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కొన్ని శరీర భాగాలు పక్కనే ఉన్న పొలాల్లో పడినట్లు స్థానికులు తెలిపారు. పేలుడు శబ్దం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని, దట్టమైన పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. పేలుడు ధాటికి సమీప గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాల భవనం స్లాబ్‌కు కూడా పగుళ్లు వచ్చినట్లు సమాచారం.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. తీవ్రంగా గాయపడిన మరో 8 మందిని అంబులెన్సుల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భయాందోళనలు వ్యక్తమ వుతున్నాయి. బాణసంచా తయారీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీకి అనుమతులు, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# వేట్లపాలెం పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**కార్మికుల మృతిపై ఆవేదన - బాధిత కుటుంబాలకు సానుభూతి**

**నష్టపరిహారం, వైద్యసహాయం కల్పించాలని డిమాండ్**



**అమరావతి, ఫిబ్రవరి 28**

: కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల ద్వారా తన విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇటువంటి విషాద సమయంలో ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికులు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. అలాగే పేలుడు ధాటికి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యసహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా స్పందించాలని కోరారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

**- రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన సదస్సు**

**జగిత్యాల, ఫిబ్రవరి28,**

రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ లో అరివ్‌ఆలివ్ కార్యక్రమంలో భాగంగా ఆటో, బస్సు, లారీ ఇతర వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.ప్రస్తుత రోజులో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది చనిపోవడం జరుగుతుందని ఈ రోడ్డు ప్రమాదాలు, వాటి వల్ల జరిగే ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంబించడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా “డిఫెన్సివ్ డ్రైవింగ్” సంస్కృతిని ప్రజల్లో అలవాటు చేయడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం మరియు చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వలననే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ మరియు బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ,సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు.

అవసరమైతే తదుపరి చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేసే ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని అన్నారు.

## హుజురాబాద్ ఎం.ఈ.ఓ గా విడపు శ్రీనివాస్ పదవి బాధ్యతలు

**హుజురాబాద్ మండల నూతన విద్యాధికారిగావిడపు శ్రీనివాస్ నియామకం.**

**ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో.**


**బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు, బీసీ నాయకులు ఘన సన్మానం.**





**హుజురాబాద్ / ఫిబ్రవరి 28:** (హుజురాబాద్ ఎంఈఓ గా ఇంతకాలం పనిచేసిన భూపతి శ్రీనివాస్ స్థానంలో మండల విద్యాధికారిగా సిరసపల్లి డిజిటల్ హెచ్ఎంగా పని చేస్తున్న విడపు శ్రీనివాస్ నియమితులయ్యారు. బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంఈఓ ను శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు విడపు రాజు, సంగెం సత్యనారాయణ, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్ప కాయల సాగర్, పద్మశాలి ప్రాంతా పద్మశాలి సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు సబ్బని రాజేందర్, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మార్త రవీందర్, (కేఆర్) మంద బిక్షపతి, కుడికాల ప్రభాకర్, తాటి పాముల తిరుపతి, బీసీ ఆజాది ఫెడరేషన్ హుజురాబాద్ మండల అధ్యక్షులు నడిగోటి రమేశ్, ఉపాధ్యక్షులు కొలిపాక క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి మామునూరి ప్రవీణ్ తో పాటు పెద్ద సంఖ్యలో బిసి నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలి : వంగ రాజేశ్వర్ రెడ్డి



**ఉమ్మడి మెదక్ జిల్లా బ్యూరో**

ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవనికి 25,000/- విరాళం అందించార ఎసిద్దిపేట పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ధ్వజస్థంభ ప్రతిష్ఠ వంటి మహోత్సవాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొంది స్తాయని పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు.25,000/- రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.శ్రీ మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు యువతలో మంచి

## హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో CMRF చెక్కుల పంపిణీ

**కార్యక్రమంలో పాల్గొన్న కమలాపూర్**

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్**



**హుజురాబాద్/కమలాపూర్/ఫిబ్రవరి 28:**

అనంతరం కమలాపూర్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్, దొడ్డ రమేష్ గారు ఒడితల ప్రణవ్ బాబు గారి సమక్షంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరనైనది. దొడ్డ రమేష్ గారి చేరికతో కమలాపూర్ కాంగ్రెస్ పార్టీకిమరింత బలం చేకూరు తుందని ప్రణవ్ బాబు గారు తెలిపినారు... ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్ల రమేష్ మౌటం కుమారస్వామి పోడేటి బిక్షపతి, కంభంపాటి ప్రసాద్, చకిలం దయాకర్, పెరుమాండ్ల పరుశరాములు, పుల్ల శోభన్, గంధసిరి అనిల్, నూక కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఏ ఎంసీ చైర్మెన్ ఆర్థిక సాయం

**,చొప్పదండి:**



పట్టణం గాంధీనగర్ లోని నిరుపేద కుటుంబానికి చెందిన జంగ సుప్రియ యొక్క తండ్రి చిన్నతనంలోనే మరణించగా.. ఆమె వివాహానికి ఏ ఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్ పదివేల రూపాయలను పరోపకారం చేయాలనే స్థానిక ఎమ్మెల్యే నిర్దేశించిన స్ఫూర్తితో కానుకగా అందజేశారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వద్లూరి అనూష శ్యాంసుందర్ స్థానిక యువకులు ప్రజలు పాల్గొన్నారు.

# వినాశకాలే విపరీత బుద్ధి

**కాంగ్రెస్‌పై హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు - కోకాపేట్‌లో శారద పీఠం వద్ద ఉద్రిక్తత**

**- ప్రభుత్వ భూమి కేటాయింపులపై ప్రశ్నలు - ఆలయ పరిరక్షణ కోసం ఆందోళన హెచ్చరిక**







**హైదరాబాద్, ఫిబ్రవరి 28**

: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను కూడా కూల్చేందుకు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్ ప్రాంతంలోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే సమాచారం అందడంతో హరీశ్ రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి ఉందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోకాపేట్ సర్వే నంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా, క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల భూమి కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి రూ. 1 కోటి 5 లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, హెచ్ఎండీఏకు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు పొందినట్లు వివరించారు. ఆలయంలో రాజశ్యామల అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమం హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో జరిగిందని, అప్పటి నుంచి నిత్య పూజలు కొనసాగుతున్నాయని తెలిపారు. వాటర్ వర్క్స్ నిర్మాణం పేరుతో ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించిన హరీశ్ రావు, అదే ప్రాంతంలో 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పుడు ఆలయ స్థలాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఆ భూమిని రేవంత్ రెడ్డి తన బంధువులకు అక్రమంగా కేటాయించారని, సమాచారం హక్కు చట్టం కింద పొందిన సమాధానాల్లో ఇది వెల్లడైందని ఆరోపించారు. ఓపెన్ వేలం వేస్తే ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం వచ్చేదని, కానీ నామినేషన్ పద్ధతిలో కేటాయింపులు జరిగాయని అన్నారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద ఎత్తున పోలీసులు వచ్చి పీఠాధిపతులను, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేయడం అనైతికమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టడాన్ని ఖండించారు. దేవాలయ పూజలను అడ్డుకోవడం భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. క్యాబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చి ఆలయాన్ని కూల్చకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఈ దేవాలయ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకోవడం తమ బాధ్యత అని, రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వబోమని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# విద్యార్థుల రవాణాలో కొత్త దిశగా సైబరాబాద్ పోలీసులు

**ట్రాఫిక్ రద్దీ నివారణే లక్ష్యం**

**డిజిటల్ పర్యవేక్షణతో భద్రతా బలోపేతం - జూన్ 2026 నుంచి అమలు**




**సైబరాబాద్, ఫిబ్రవరి 28**

: సైబరాబాద్ ప్రాంతంలో విద్యార్థుల రవాణా వ్యవస్థను ఆధునికీకరించే దిశగా సైబరాబాద్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ నాయకత్వంలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రయాణాన్ని సురక్షితంగా, తక్కువ ఖర్చుతో, డిజిటల్ పర్యవేక్షణలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులను స్కూళ్లకు, కళాశాలలకు వ్యక్తిగత వాహనాల ద్వారా తీసుకెళ్లడం వల్ల భారీ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను తగ్గించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. డిమాండ్ ఆధారంగా వాహనాల సమీకరణ చేసి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం అమలవుతోంది. ఈ వ్యవస్థలో పోలీసుల ద్వారా ధృవీకరించిన వాహనాలు మాత్రమే వినియోగంలో ఉంటాయి. సీసీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ, తక్షణ స్పందన వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే సమాజంలో నిర్ధారిత వ్యక్తులను మొబిలిటీ సూపర్‌వైజర్లుగా నియమించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ప్రభుత్వ రవాణా సంస్థ వాహనాలతో పాటు ప్రైవేట్ వాహనాలను సమన్వయం చేసి నగరవ్యాప్తంగా సమర్థవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించనున్నారు. యువతకు పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత భవిష్యత్తును అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రణాళిక 2026 జూన్ నుంచి దశల వారీగా అమలులోకి రానుంది.

# వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిలను ఆహ్వానించిన భట్టి విక్రమార్క

**కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి ఆహ్వానం**

**వచ్చే నెల 5న హైదరాబాద్‌లో వేడుక - మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేత**



**హైదరాబాద్, ఫిబ్రవరి 28**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి శ్రీమతి విజయమ్మను, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. భేటీ సందర్భంగా భట్టి విక్రమార్క వివాహ ఆహ్వాన పత్రికను వారికి అందజేశారు. కుటుంబ వేడుకకు హాజరై తమ ఆశీస్సులు అందించాలని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు.



ఈ సందర్భంలో పరస్పర శుభాకాంక్షలు కూడా తెలియజేసుకున్నారు. హైదరాబాద్‌లో జరగనున్న ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులు, సన్నిహితులు హాజరుకానున్నట్లు సమాచారం. కుమారుడి వివాహాన్ని సాదాసీదాగా, కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిసింది.

# రాహుల్ విజ్ఞాన్‌లో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**చర్ల** : మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్మరాజు ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు సైన్స్ విశిష్టతను, జాతీయ విజ్ఞాన దినోత్సవం ప్రాముఖ్యతను, రామన్ ఫలితాన్ని విద్యార్థులకు వివరించారు. విజ్ఞాన శాస్త్రవేత్తలు సి.వి.రామన్, ఏపిజే అబ్దుల్ కలాం, సర్ ఐసాక్ న్యూటన్,లూయి పాశ్చర్, ఆల్బర్ట్ ఐన్ స్టీన్, జగదీష్ చంద్రబోస్, శ్రీనివాస రామానుజన్,మేడం క్యూరీ తదితర వేషధారణలో ఉన్న శాస్త్రవేత్తల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్స్ ఒక్కొక్కటిగా వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు వారిలో ప్రతిభను కనబరిచి ప్రాజెక్టులు చేయడంతో విద్యార్థులను, వారికి సహకరిస్తూ, ప్రోత్సాహం అందిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ డాక్టర్ డి.ఎన్ కుమార్, డాక్టర్ ప్రతిభ, ఈడి టీవీపీసీ శాస్త్రి, ప్రిన్సిపాల్ వర్మ రాజు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎల్ నరసింహారావు, సైన్స్ ఉపాధ్యాయులు షేక్ ఉస్మాన్, అద్దంకి బోస్ బాబు, బిట్రగుంట క్రాంతి కుమార్, ఎం సునీత, ఆవుల జ్యోతి, సంగీత ,సౌజన్య,సంధ్య,చైతన్య తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**డీఎంకేతో పొత్తు కుదరకపోతే**

# టీవీకేతో కాంగ్రెస్ జట్టు



**చెన్నై - 28 ఫిబ్రవరి**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలన్నీ వ్యూహరచనల్లో నిమగ్నమై పొత్తుల గణితంపై లోతైన చర్చలు సాగిస్తున్నాయి. అధికార పార్టీ ద్రావిడ మున్నేట్ర కళగం మరియు భారత జాతీయ కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై ప్రాథమిక చర్చలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల సంఘం ఎప్పుడైనా షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇరుపక్షాలు ముందుగానే వ్యూహాత్మక నిర్ణయాలకు సిద్ధమవుతున్నాయి. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తమిళనాడు ఇన్‌ఛార్జి గిరీష్ చోదంకర్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సహ ఇన్‌ఛార్జి నివేదితా ఆల్వా తదితరులు డీఎంకే రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి, సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలోని కమిటీతో చర్చలు జరిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 25 స్థానాల్లో పోటీ చేయగా, ఈసారి కనీసం 35 స్థానాలు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అదనంగా రెండు రాజ్యసభ స్థానాలపై కూడా కాంగ్రెస్ పట్టుబడుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే డీఎంకే వర్గాలు 27 లేదా 28 అసెంబ్లీ స్థానాలు, ఒక రాజ్యసభ స్థానాన్ని మాత్రమే కేటాయించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చర్చలు ఫలించకపోతే తమిళనాడులో కొత్త రాజకీయ సమీకరణాలు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నటుడు విజయ్ స్థాపించిన తమిళగా వెట్రి కళగం తో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకునే అవకాశంపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై విజయ్ ప్రత్యక్షంగా స్పందించనప్పటికీ, ఆయన తండ్రి ఎస్ ఏ చంద్రశేఖర్ కాంగ్రెస్‌తో కలిసి వెళ్లే అవకాశాన్ని సూచించేలా వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావడంలో విజయ్ పాత్ర ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అధికారికంగా ఈ అంశాన్ని ఖండించినప్పటికీ, డీఎంకేతో సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం కుదరకపోతే టీవీకేతో చేతులు కలపడం అసాధ్యమేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్ మధ్య దూరం పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో సీట్ల గణితం ఎలా మలుపు తిరుగుతుందన్నది తమిళనాడు రాజకీయాల్లో కీలక అంశంగా మారింది.

**ఇరాన్‌పై దాడుల ప్రభావంతో**

# ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం

**- మధ్యప్రాచ్యానికి అన్ని విమాన సర్వీసులను నిలిపివేసిన ఎయిర్ ఇండియా**

**- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పెరిగిన తీవ్ర ఉద్రిక్తతలు**

**- పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలను రద్దు చేసిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్**




**న్యూఢిల్లీ -- 28 ఫిబ్రవరి**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో, అంతర్జాతీయ విమానయాన సేవలపై భారీ ప్రభావం చూపుతోంది. ఇరాన్‌పై మరికొన్ని దేశాల --- ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ --- సైనిక చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా మరియు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రయాణికుల భద్రతను అగ్రాధారంగా తీసుకుంటూ, మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్య స్థలాలకు పరుగులు చేసేందుకు ఉండే విమాన సర్వీసులను తక్షణమే లి నిలిపివేయడం లి నిర్ణయించారు. ఎయిర్ ఇండియా తన అధికారిక ప్రకటనలో తెలిపింది, "మధ్యప్రాచ్య ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారినందున మా ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. అందుకే అన్ని గమ్యస్థానాలపై ఉన్న విమానాలను నిలిపివేస్తున్నాం. భద్రతా పరిస్థితిని నిరంతరం పరిశీలించి, అవసరమైతే మా ఆపరేషన్లను సర్దుబాటు చేస్తాం." సంస్థ ప్రయాణికులకు అన్ని విధాలా సహాయమిస్తుందని హామీ ఇచ్చింది. విమాన సేవలు నిలిపివేయడంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా ముందెత్తినట్లు తెలిపింది. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పశ్చిమాన అన్న దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలను రద్దు చేసినట్లు సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఈ నిర్ణయం పెద్ద సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికులకు, ప్రత్యేకంగా మధ్యప్రాచ్యంతో సంబంధిత టికెట్‌లు ఉన్నవారికి ప్రభావం చూపుతోంది. ప్రయాణికులు తమ విమానాల స్టేటస్ తెలుసుకోవాలంటే ఆన్‌లైన్‌లో లేదా 24 గంటల కాల్ సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చు: 91 1169329333, 91 1169329999రద్దైన ప్రయాణాల, టికెట్ మార్పుల వివరాలను ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లోని 'మేనేజ్ బుకింగ్' విభాగంలో పొందవచ్చు. పరిస్థితి ఇంకా తీవ్రమైతే యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రతకు చేరే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెప్పడం, ఈ నేపథ్యంలో విమాన సేవల నిలిపివేత ముందుచూపుగా తీసుకున్న చర్యని భావిస్తున్నారు.



# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.

## వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

### కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి



తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి–సోదరి–కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

## మల్లేశ్.. ఓ పెద్ద కథ



శ్రీనాథ్ మాగంటి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'మాన్షన్‌హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయిమీనాక్షి భాస్కర్ల కథానాయికలు. రాజేష్ నిర్మాత. ఈ నెల 6న సినిమా విడుదలకానుంది. ప్రచార చిత్రాలకు ఇప్పటికే మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని లాంచ్ చేశారు. అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఈ ట్రైలర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'అదొక పెద్ద కథ' అంటూ మురళీధర్‌గౌడ్ చెప్పడంతో ఈ ట్రైలర్ మొదలైంది. హీరో మల్లేష్ క్యారెక్టరైజేషన్, పెళ్లి చూపులు, తర్వాత జరిగిన సంఘటనలు.. ఇవన్నీ వినోదాన్ని పంచాయి. మల్లేష్ పాత్రలో శ్రీనాథ్ ఒదిగిపోయారని, మిగతా పాత్రలు కూడా ఆసక్తికరంగా సాగాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అమ్మముత్తు, సంగీతం: సురేష్ బొబ్బిలి.

## ఎల్లమ్మ సినిమా చేయడం లేదు

సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

